కనుల పండువగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

గోదాసమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 23: షాద్‌గనర్ మున్సిపాలిటీలోని గోదాసమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం గోదాసమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయంలో హోమం, రథబలి, నిత్యారాధన, సేవాకాలం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, మహాకుంభ ప్రోక్షణ, రాజభోగం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే నర్సింహులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. చక్రస్నాన కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు అర్చకులు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన గౌడసంఘం నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 23 : ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయం నుంచి ప్రజాపాలన మొదలుపెట్టిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఓబీసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఈసీ శేఖర్‌గౌడ్, శంకరయ్యగౌడ్, మహేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, బాలరాజుగౌడ్, జగదీశ్‌గౌడ్, మాదగోని జంగయ్యగౌడ్, అశోక్‌వర్ధన్, కృష్ణ, సురేశ్ పాల్గొన్నారు.

కాసాని నామినేషన్‌కు తరలిన శ్రేణులు

చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 23: చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ సందర్భంగా చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని నాయకులు సూచించారు. కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

- నాలుగు నెలల్లోనే పాత రోజులు
- పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీఆర్ఎస్‌దే గెలుపు
- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- నేడు ఆమనగల్లు బ్లాక్ మండలాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచారం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఏప్రిల్ 23 : అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చిందని విమర్శించారు. ప్రజలను మాయ చేసి, మోసపూరిత మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, ఆసరా పింఛన్ రూ.4 వేలు, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, వ్యవసాయానికి 24 గంటల కరెంట్, అన్ని పంటలకు రూ.500 బోనస్ ఎక్కడికి పోయాయన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక 15 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులపై పర్యవేక్షణ లోపంతో నీళ్లన్ని వృథాగా సముద్రంలోకి వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాణిని వినిపించడానికి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.

నేడు మండలాల్లో ప్రచారం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆమనగల్లు బ్లాక్ మండలాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో ఉదయం 10 గంటలకు సేవాలాల్ మహారాజ్ ఆలయంలో పూజలు నిర్వహించి రోడ్డుషోతో ప్రచారం ప్రారంభవుతుందని తెలిపారు. అనంతరం తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండల్లాలోని గ్రామాల్లో రోడ్డుషోలు, కార్నర్ మీటింగులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అదే విధంగా ఈ నెల 27న నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహించే ప్రచారానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రానున్నారని ఆయన వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల గౌరవాధ్యక్షుడు గంప శ్రీనుగుప్తా, రాజేందర్‌యాదవ్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

షాబాద్ : విద్యార్థులను అభినందిస్తున్న మాజీ సర్పంచ్ నర్సింహులు, ఉపాధ్యాయులు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 23: పెద్దఅంబర్‌పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులువీ పాండురంగం తెలిపారు. మొత్తం 8 మంది విద్యార్థులు పరీక్ష రాగా.. ఆరుగురు ఎంపికవడంపై ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

షాబాద్ : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింహులు అన్నారు. షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఏడు మంది విద్యార్థులు తెలంగాణ గురుకుల సెట్-2024 సంవత్సరానికిగాను గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఎంపికయ్యారు. మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ స్వరూప, పాఠశాల హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు వనజ, లిఖిత, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : గురుకులాలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం పాండురంగం

విద్యతోనే బాలిక సాధికారత సాధ్యం

మాట్లాడుతున్న సీఐ శంకర్‌కుమార్

యాచారం, ఏప్రిల్ 23: విద్యతోనే బాలిక సాధికారత సాధ్యమని సీఐ శంకర్‌కుమార్ అన్నారు. మండలంలోని నందివనపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలిక సాధికారత కార్యక్రమంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలకు తగిన సూచనలు, సలహాలను అందజేశారు. బాల్య వివాహాలు, సమస్యలు, బాలికల హక్కుల రక్షణ గురించి వివరించారు. బాలికలు కరాటే విన్యాసాలను ప్రదర్శించారు. స్వరక్షణ కోసం బాలికలు ప్రదర్శించిన కరాటే విన్యాసాలను సీఐ అభినందించారు. ఈ సందర్భంగా సీఐ శంకర్‌కుమార్ మాట్లాడుతూ..ఆడపిల్లల సాధికారతకు విద్య మూల స్థంబం లాంటిదని చదువుతోనే బాలికల ఉన్నతికి మార్గం సాధ్యమవుతుందన్నారు. ఆడపిల్లలను స్వేచ్ఛగా చదువనిచ్చి, ఎదుగనివ్వాలన్నారు. ఆడపిల్లల స్వరక్షణకు కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలని ఆయన సూచించారు. బాలికలు బాలురతో సమానంగా విద్యనభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలిక ఎదుగుదలకు ప్రతి ఒక్కరూ భరోసా కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరామశాస్త్రి, ఉపాధ్యాయులు కిషన్, బోజయ్య, పద్మశ్రీ, శ్రీలత, అరుణ, అజయ్‌రాథోడ్, సురేశ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

క్యామ మల్లేశం గెలుపు కోసం కృషి చేయాలి

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 24 : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశం గెలుపుకోసం అందరం ఐకమత్యంతో కలిసికట్టుగా కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రవణమోని జంగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోరాట ఫలితంగా సాధించిన రాష్ట్రంలో గత పదేండ్లల్లో బీఆర్ఎస్ పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ గెలుపొందిన వెంటనే కష్టాలు మొదలయ్యాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ తప్పులను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు.

సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

షాద్‌నగర్, ఏప్రిల్ 23 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసే ప్రతి సమావేశానికి, ప్రచారాలకు ఎన్నికల కమిషన్ అనుమతులను కచ్చితంగా తీసుకోవాలని ఆర్డీవో వెంకటమాధవరావు మంగళవారం తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 18న ప్రారంభమైందని, 25న నామినేషన్లు పూర్తి అవుతాయని తెలిపారు. 29న పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని, వచ్చే నెల 13న ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని, ఈ విషయాలను అన్ని వర్గాల ప్రజలు తెలుసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి అదృశ్యం

అదృశ్యమైన లోకా రెడ్డి

చేవెళ్ల టౌన్, ఏప్రిల్ 23: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పేదవేడు గ్రామానికి చెందిన లోకారెడ్డి (69) ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్య ఉండటంతో చేవెళ్ల మండల కేంద్రంలోని పట్నం మహేందర్ రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 21వ తేదీన రాత్రి కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాగిడిని భారీ మెజార్టీతో గెలిపించాలి

వాకర్స్‌ను కలిసి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 23 : ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం ఉదయం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ఆటోనగర్ మహావీర్ హరిణ వనస్థలి వాకర్స్‌ను బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆటోనగర్ హరిణ వనస్థలి పార్కులో వాకర్స్ కోసం తాగునీటి సౌకర్యం, ఓపెన్ జిమ్ సౌకర్యం కల్పించామని, పిచ్చి మొక్కలను కూడా తొలగిస్తామని తెలిపారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మల్కాజ్‌గిరిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, అందుబాటులో ఉండి పనులు చేస్తానని తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, లక్ష్మారెడ్డి, వాకర్స్ ప్రతినిధులు విజయేందర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

ఎల్బీనగర్ , ఏప్రిల్ 23 : పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజ్‌గిరి స్థానంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సతీమణి దేవిరెడ్డి కమలారెడ్డి అన్నారు. గడపగడపకు బీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా మల్కాజ్‌గిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ నాగోలు డివిజన్ శివపురి కాలనీలో దేవిరెడ్డి కమలారెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాగోలు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి, శిల్పారెడ్డి, కవిత, రంజిత్ గౌడ్, శ్రీధర్ గౌడ్, ఉమ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'కాసాని' నామినేషన్‌కు తరలిన నాయకులు

బడంగ్‌పేట, ఏప్రిల్23: చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. మహేశ్వరం, తుక్కుగూడ, జల్‌పల్లి, మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నామినేషన్ ప్రక్రియ ర్యాలీలో పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

రూ 15.44కోట్ల నగదు స్వాధీనం

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.15. 44కోట్ల నగదును ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. రూ. ఏడుకోట్ల 13 లక్షల విలువజేసే ఇతర వస్తువులు, 20,989 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. 211 మందిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 439 ఫిర్యాదులు రాగా, వాటిని పరిష్కరించామన్నారు. 289 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 2,957 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేసినట్లు రోనాల్డ్ రాస్ తెలిపారు. తాజాగా, గడిచిన 24 గంటల వ్యవధిలో రూ.77. 50లక్షల నగదు, రూ.22.65 లక్షల విలువైన వస్తువులను పట్టుకొని, సీజ్ చేసినట్లు చెప్పారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఆమనగల్లు : ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఆమనగల్లు, ఏప్రిల్ 23 : అర్హులైన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ లలిత అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో ఎంపీడీవో సమావేశ మందిరంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లలిత, ఐసీడీఎస్ సీడీపీవో రోజా మాట్లాడుతూ.. మే 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చే వయో వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆటోలు, ట్రైసైకిళ్లు కేటాయించినట్లు తెలిపారు. అనంతర పట్టణంలోని పుర వీధులు, జాతీయ రహదారి గుండా ఓటు హక్కు ప్రాధాన్యత తెలియజేస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ వసంత విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, బీఎల్‌వోలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్ : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో దానిని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ వార్డు కార్యాలయంలో మెప్మా సభ్యులతో ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మెప్మా సభ్యులు ఓటు హక్కు వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్,ఈఈ హరీశ్, వార్డు ఆఫీసర్ మల్లేశ్, శివకార్తిక్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్ :మెప్మా సభ్యులతో సమావేశమైన కమిషనర్ సత్యనారాయణరెడ్డి

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి దేవాలయల వద్ద ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. తమల పాకుల చేత భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని చౌడమ్మగుట్ట వీరాంజనేయస్వామి దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆమనగల్లు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా హనుమాన్ విజయయాత్రను నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ పాల్గొన్నారు. అనంతరం పుర వీధుల గుండా వీర హనుమాన్ విగ్రహంతో భారీ శోభాయాత్ర నిర్వహించారు.

కడ్తాల్ : ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, హారతీ, హోమాలు, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అన్మాస్‌పల్లి గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేసి, ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

కొత్తూరు : జై హనుమాన్ నినాదాలతో కొత్తూరు మండలం, మున్సిపాలిటీ దద్దరిల్లిపోయింది. శ్రీరామ్‌నగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో ఆలయ ధర్మకర్తలు రాజేంద్రప్రసాద్ శుక్లా, సురేంద్రప్రసాద్ శుక్లా విద్యాసాగర్‌ప్రసాద్ శుక్లా ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని ఘనంగా జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సుందరకాండ పారాయనం, అన్నదానం చేశారు. మున్సిపాలిటీలోని శ్రీమారుతి హనుమాన్ ఆలయంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ విజయయాత్రని ఘనంగా నిర్వహించారు.

మొయినాబాద్ : భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి మొయినాబాద్‌లోని హనుమాన్ దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. చిలుకూరులో అర్చకులు రంగరాజన్ ప్రత్యేక పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. యాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. కార్యక్రమంలో అర్చకులు రంగరాజన్, భాగ్యనగర్ ధర్మ ప్రచార ప్రముఖ్ కృష్ణా రెడ్డి, నాయకులు నందు, గోపాల్‌రెడ్డి, శ్రీరాములు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల టౌన్ : భజరంగ్‌దళ్ అధ్వర్యంలో చేవెళ్ల గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి పుష్కరిణి సమీపంలోని ఉన్న హనుమాన్ దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మారెడ్డి, విశ్వహిందూ పరిషత్, పలు యువజన సంఘాల సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

యజమానులు నిబంధనలు పాటించాలి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 23 : ప్రైవేటు హాస్టళ్ల యజమానులు విద్యార్థుల సౌకర్యార్థం సరైన నిబంధనలు పాటించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లి సమీపంలో గల అన్ని బాలికలు, బాలుర హాస్టళ్ల యజమానులకు పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు,. సెక్యూరిటీగార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. బాలికల హాస్టల్ వద్ద ఉమెన్ స్టాప్‌ను నియమించాలని సూచించారు. సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మారయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయళ్ల అరెస్టు

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 23 : పేకాడుతున్న నలుగురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇబ్రహీంపట్నం ఎస్ఐ మారయ్య వివరాల ప్రకారం.. పోచారం గ్రామ సమీపంలో రణవీర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కొంతమంది పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్ఐ మారయ్య, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు, బాబురావులు పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న వారిని, వారి నుంచి రూ.6500 నగదు, 4 సెలిఫోన్లు, 3 బైకులు, 2 సెట్స్ కార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 23: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని, పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని దేవుని ఎర్రవల్లి గ్రామ మాజీ సర్పంచ్ సామా మాణిక్యారెడ్డి, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దేవుని శర్వలింగం అన్నారు. మంగళవారం వారు చేవెళ్లలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. సమావేశంలో శ్రీశైలం, శ్రీనివాస్, మాణిక్యం పాల్గొన్నారు.